సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

భారీ అన్నసమారాధన



ఈశ్వరినగర్‌లో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఉత్సవ నిర్వాహకులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలి కొండవాలు ప్రాంతం ఈశ్వరినగర్‌లో జరుగుతున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వాహకులు అన్నసమారాధన నిర్వహించారు. ఎర్నిదుర్గా, మహాకాళి, భైరవ శక్తి పీఠం గురుస్వామి అభిరాం అఘోరా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాంసాహారంతో కూడిన అన్నదానం చేశారు. పెదగదిలి, చినగదిలి, ఈశ్వరినగర్, సాలిపేట తదితర కొండవాలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం అమ్మవారి అనుపు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

జోరుగా లాసన్స్ బే కాలనీ గెడ్డ ఆధునికీకరణ



గెడ్డలో జరుగుతున్న కాంక్రీట్ ఫ్లోరింగ్ పనులు

ఎంవీపీకాలనీ: లాసన్స్ బే కాలనీ గెడ్డ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొంత కాలంగా ఈ గెడ్డ వ్యర్థాలతో మూసుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతున్న విషయం తెలిసిందే. భారీ వర్షాల సమయంలో గెడ్డ నీరు ప్రధాన రహదారిపై ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గెడ్డలోని చెత్తాచెదారం రోడ్డుపైకి చేరడంతో అధ్వాన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం రూ.1.5 కోట్లతో చేపట్టిన 20వ వార్డు అభివృద్ధి పనుల్లో భాగంగా ఈ గెడ్డను ఆధునికీకరిస్తున్నారు. గ్రౌండ్ లెవల్‌లో ఐరెన్‌తో కూడిన కాంక్రీట్ ఫ్లోరింగ్‌తోపాటు వాల్స్ నిర్మాణం జోరుగా సాగుతోంది.

తీరం.. జనసంద్రం



రుషికొండ బీచ్‌లో పర్యాటకుల సందడి

కొమ్మాది: పర్యాటక ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు పర్యాటకుల తాకిడి కనిపించింది. గుడ్లవానిపాలెం బీచ్, సాగర్‌నగర్ బీచ్, రుషికొండ బీచ్, తొట్లకొండ బీచ్, రామానాయుడు ఫిల్మ్ స్టూడియో, ఎర్రమట్టి దిబ్బలు, భీమిలి బీచ్ ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది. చిన్నా పెద్దా అంతా ఉత్సాహంగా గడిపారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఆర్‌ఎం అప్పలనాయుడు

మధురవాడ: ఏపీఎస్‌ఆర్‌టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని ఆర్‌ఎం అప్పలనాయుడు చెప్పారు. ఆదివారం మధురవాడలో నిర్వహించిన రిటైర్డ్ ఎంప్లాయీస్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఈపీఎఫ్‌కి సంబంధించి సరైన డాటా అందించాల్సి ఉందన్నారు. ఒక్క అక్షరం కూడా తప్పు లేకుండా 10డి ఫారాలు నింపి పంపాలన్నారు. దీనికి ఎటువంటి సహకారం కావాలన్నా విశాఖ జిల్లాలో ఉన్నా యూనిట్లను సంప్రదించవచ్చన్నారు. ఆరోగ్య సమస్యలు పరిష్కారానికి రిటైర్డ్ ఆర్‌టీసీ ఉద్యోగి, గుండె వైద్య నిపుణుడు అయిన సుబ్రహ్మణ్యాన్ని సంప్రదించాలని, ఎంవీపీలోని సంస్థ డిస్పెన్సరీలో ప్రతి శుక్రవారం ఉచిత కన్సల్టేని సద్వినియోగం చేసుకోవాన్నారు. కార్యక్రమంలో ఏవీ రావు, రాయి, ఇతర విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

నడక వంతెనకు మోక్షమెప్పుడో..?

- పూర్తిగా శిథిలమైన రామ్‌నగర్ బ్రిడ్జి
- కొత్త వంతెన నిర్మాణ పనులను గాలికొదిలేసిన అధికారులు
- స్థానికులు, రజకుల భయాందోళనలు



రామ్‌నగర్‌లో శిథిలావస్థకు చేరిన నడక వంతెన

టీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్‌లోని 20 ఏళ్ల నాటి నడక వంతెన పూర్తిగా శిథిలమైంది. స్థానికులు ప్రధాన రహదారికి చేరుకోవాలంటే ఈ బ్రిడ్జిపై నుంచే నడుచుకుంటూ వెళ్లాల్సి ఉంది. దీని కిందనే స్థానిక రజక కుటుంబాలు దోబీఘాట్ ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నాయి. ఏళ్ల నాటి వంతెన కావడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని రామ్‌నగర్ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. శిథిలమైన బ్రిడ్జిపై నుంచి నడవాలంటేనే భయపడుతున్నారు. రజక కుటుంబాలు దోబీఘాట్‌లో దుస్తులు ఉతికేందుకు భయంతో అల్లాడిపోతున్నారు. ఈ బ్రిడ్జి పునర్నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన కూటమి ప్రభుత్వం, జీవీఎంసీ అధికారులు ఆ పనులను గాలికొదిలేశారు. దీంతో తమ నడక వంతెనకు ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని రామ్‌నగర్ వాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అనుమతులు

పాత జైలు రోడ్డు నుంచి రామ్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపైకి ఈ బ్రిడ్జి మీద నుంచే నడుచుకుంటూ చేరుకోవాలి. నడక వంతెన శిథిలమవడంతో స్థానికులు, పాదచారులు ఎదుర్కొంటున్న ఈ సమస్యను అర్థం చేసుకున్న



బీటలు వారిన బ్రిడ్జి స్తంభాలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవీఎంసీ కౌన్సిల్‌లో బ్రిడ్జి పునర్నిర్మాణానికి అనుమతులిచ్చింది. ఆ తరువాత సాధారణ ఎన్నికల కోడ్ రావడంతో శంకుస్థాపన చేయలేకపోయారు. గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ బ్రిడ్జి నిర్మాణం గురించి ఎవరూ పట్టించుకోలేదు.

10 నెలల కిందట శంకుస్థాపన

నడక బ్రిడ్జి మంజూరైనా.. పనులకు శంకుస్థాపన జరగకపోవడంతో వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ జీవీఎంసీ కౌన్సిల్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. వంతెనతోపాటు దోబీఘాట్ నిర్మాణానికి రూ.27 లక్షలు మంజూరు చేశారు. ఈ ఏడాది జనవరి 4న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయించారు. నేటికీ 10 నెలల కాలం గడిచినా.. పనులు మాత్రం ప్రారంభం కాలేదు.



వంతెన కింద రజకుల దోబీఘాట్

ప్రారంభం కాని పనులు

శంకుస్థాపన జరిగి 10 నెలలవుతున్నా శిథిలమవుతున్న బ్రిడ్జిని తొలగించే పనులు కూడా ప్రారంభం కాలేదు. వంతెన స్తంభాలు పూర్తిగా బీటలు వారినా అధికారులు పట్టించుకోవడం లేదు. దానిపై నుంచి నడవాలంటే ఏ సమయంలో కూలిపోతుందో తెలియక స్థానికులు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బ్రిడ్జి కింద దుస్తులు శుభ్రం చేయాల్సి వస్తోందని రజకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే నడక వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వంతెనపై నడవాలంటే భయం



మేము ప్రధాన రహదారికి వెళ్లేందుకు ఉన్న మార్గం ఈ నడక వంతెన. ఇది నిర్మించి చాలా ఏళ్లయింది. బ్రిడ్జి స్తంభాలు బీటలు పడి పూర్తిగా శిథిలమైంది. ఈ వంతెనపై నుంచి నడవాలంటే చాలా భయంగా ఉంటుంది. 10 నెలల కిందట కొత్త వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. నేటికి ఎటువంటి పనులు ప్రారంభం కాలేదు. తక్షణమే బ్రిడ్జి పనులు ప్రారంభించాలి.

– అల్సి అప్పలనారాయణ, రామ్‌నగర్

తక్షణమే పనులు ప్రారంభించాలి



నడక వంతెన కింద ఉన్న దోబీఘాట్‌లో రజకులు కుల వృత్తి చేసుకోవాలంటే భయపడుతున్నారు. ఏ క్షణాన వంతెన కూలిపోతుందో తెలియక, ప్రాణాలకు ఏం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు తక్షణమే బ్రిడ్జి పనులు ప్రారంభించి పూర్తి చేయాలి. రజకులు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలి.

– బొట్ట నాగవెంకట సత్యనారాయణ, స్థానికుడు

వాహనాలతో నిండిపోయిన రైతుబజార్ రహదారి

ఆరిలోవ: ఆరిలోవ తోటగరువు రైతుబజార్ రహదారి వాహనాలతో నిండిపోతోంది. వినియోగదారులు బజార్‌లోకి వెళ్లి కూరగాయలతో తిరిగి రావడానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ నెల 2న తోటగరువులో రైతుబజార్ అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది జనాభా ఉండటంతో రైతుబజార్‌కు రోజురోజుకూ రద్దీ పెరుగుతోంది. పెదగదిలి బ్రిడ్జి నుంచి రైతుబజార్ లోపలకు సుమారు 100 మీటర్లు దూరం ఉంటుంది. అక్కడికి చేరడానికి సన్నని రహదారి ఉంది. దానిపై కొందరు వినియోగదారులు ద్విచక్ర వాహనాలు నిలపగా.. మరికొందరు వ్యాపారులు కూరగాయల కోసం ఆటోలపై వచ్చి వాటిని కూడా అదే రోడ్డుపై నిలిపేస్తున్నారు. దీంతో ఇరువైపులా నిలుపుతున్న వాహనాలతో



తోటగరువు రైతుబజార్ రహదారిపై నిలిపిన వాహనాలు

రోడ్డుపై నడవడానికి సైతం ఇబ్బంది పడుతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. వాహనాలు నిలపడానికి ప్రత్యేకంగా పార్కింగ్ కోసం రైతుబజార్, విమ్స్ గోడ మధ్యలో ఉన్న ఖాళీ స్థలాన్ని కేటాయించాలని కోరుతున్నారు.

కుక్‌వేర్ ఎగ్జిబిషన్‌కు స్పందన

టీచ్‌రోడ్డు: ఈ నెల 3న రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో సత్వ నేచురల్స్(సీతమ్మధార) ఆధ్వర్యంలో ప్రారంభించిన కుక్‌వేర్ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌కు సందర్శకుల నుంచి విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకురాలు వనుకూరు లక్ష్మీతేజ తెలిపారు. ఈ నెల 7 వరకు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు. ఇందులో ప్రముఖ బ్రాండ్‌లైన ఇండస్ వ్యాలీ, వండర్ చెఫ్, ప్రెస్టీజ్ ప్రొడక్ట్‌లపై 50 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్లు చెప్పారు. ట్రై ప్లై స్టీల్, కాస్ట్ ఐరన్, ఐరన్, సిరామిక్, ఇత్తడి వంట పాత్రలు, గాజు, రాతి, చెక్క పనిముట్లు, ఇతర ఆర్గానిక్ ఉత్పత్తులు డిస్‌ప్లే చేసి విక్రయిస్తున్నామన్నారు. ఆర్గానిక్ ప్రొడక్ట్‌లపై ఆయా కంపెనీలు 25 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తున్నాయని పేర్కొన్నారు.



సత్వ నేచురల్స్ కుక్‌వేర్ ఎగ్జిబిషన్

ఇక్కడ చిరుధాన్యాలతో చేసిన చిరుతిండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయన్నారు. ఈ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌ను నగర వాసులు సందర్శించి అధిక డిస్కౌంట్లతోపాటు లక్కీ డ్రా ద్వారా ప్రత్యేక బహుమతులు పొందవచ్చని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సందడి చేస్తున్న జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

డాబాగార్డెన్స్: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ హైస్కూల్ 1987–88 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలిసారు. స్పర్శ స్వచ్ఛంద సంస్థ ద్వారా మధురవాడ ఐటీ హబ్‌లో ఉన్న ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో వీరంతా కలుసుకున్నారు. సమ్మేళనంలో దేశ, విదేశాల్లో స్థిరపడిన మిత్రులందరు ఒకే వేదికపై కలుసుకుని ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకుని సరదాగా గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ కష్ట సుఖాలు తోటి మిత్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నృత్యాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. వయసు మరిచిపోయి 50 ఏళ్లు దాటినా.. 20 ఏళ్ల కుర్రాళ్లలా గంతులేశారు. 12 ఏళ్ల కిందట ఏర్పాటు స్పర్శ సంస్థను ఏర్పాటు చేశామని, ప్రతి ఏటా అక్టోబర్‌లో మిత్రులంతా కలుసుకుంటామని వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ట శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి కర్రి సంజయ్ ఆలపించిన పాటలు అలరించాయి. కార్యక్రమం విజయవంతం చేసేందుకు కృషి చేసిన ఆర్గనైజర్లు రషీద్, దుక్క పరమేశ్వరరావు, ఖాదరవల్లీ, సునీల్, కాకి శ్రీనుతో పాటు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి శ్రీను, సహాయ కార్యదర్శి ఇబ్రహీం, కోశాధికారి పెంటకోట నగేష్ కృతజ్ఞతలు తెలిపారు.



ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

భీమునిపట్నం: విశాఖ ఏవీఎన్ కళాశాలలో 1977 నుంచి 80 వరకు సైన్స్ డిగ్రీ చేసిన పూర్వ విద్యార్థులు 40 మంది కోట పద్మారాణి నివాసం వద్ద కలుసుకున్నారు. చిన్నపిల్లల్లా సరదాగా గడిపారు. అప్పటి రోజుల్లో ఎలా ఉండేవారు, సరదాల గురించి మాట్లాడుకుని ఎంతో సంతోషించారు. అలాగే ఎవరు ఎక్కడుంటున్నారు, ఏం చేస్తున్నారు, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ విశ్వేశ్వరరావు, ప్రొఫెసర్ మురళి, పారిశ్రామిక వేత్త మోహనరావు, రైల్వే అధికారి బాలాజీ, మెరైన్ ఇంజినీర్ శ్రీనివాసరావు తమ అనుభవాలను తెలిపారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న కళాశాలకు తగిన మేరకు సాయం చేయాలని నిర్ణయించారు. సాయంత్రం వరకు అందరు ఆనందంగా గడిపి తిరిగి తమ గమ్యస్థానాలకు పయనమయ్యారు.

మత్స్యకార యువకుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నూకరాజు తల్లిని పరామర్శిస్తున్న ఉమ్మిడి కల్యాణ్

ఎంవీపీకాలనీ: జోడుగుళ్లపాలెం మత్స్యకార ప్రాంతానికి చెందిన గరికిన నూకరాజు కుటుంబానికి వైఎస్సార్‌సీపీ 18వ వార్డు అధ్యక్షుడు ఉమ్మిడి కల్యాణ్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల చేపల వేటకు వెళ్లిన నూకరాజు పడవ బోల్తాపడి ప్రమాదవశాత్తు మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం కల్యాణ్ తదితర మత్స్యకార యువకులు నూకరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి నగదు అందించారు. కార్యక్రమంలో పలువురు 18వ వార్డు మత్స్యకార యువకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న సత్యసాయి ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా – స్వచ్ఛత నుంచి దివ్యత కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థలు ఈనెల 2 నుంచి 20 వరకు దేశవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా ఈ రోజు సెక్టార్–2లో సమితి మహిళ, పురుష యువత, సేవాదళ్ సభ్యులు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు ఏరి, పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం ఉక్కునగరంలోని సత్యసాయి సమితి మందిరం పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా జీవించాలని కోరారు.

నవ్వుల్లో ముంచెత్తిన వినోదాల విందు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్(విశాఖ, హైదరాబాద్) ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహించే వినోదాల విందులో భాగంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కామెడీ షో జరిగింది. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన కళాకారులు జబర్దస్త్ ప్రకాష్, పుష్యమి, రాగస్ నాయుడు, సూర్య, ఎస్.ఎస్.నాయుడు, పోర్టు శేషు, భానుప్రకాష్‌లు ప్రదర్శించిన కామెడీ స్కిట్లు ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. అత్తగారి ఏడుపు, థియేటర్‌లో ఉన్నాను, కవిత, అన్నదానం, ఎంతమంది పిల్లలు, దారి ఎటు పోతుంది, సెలూన్, ఇంజినీరింగ్ కుటుంబం, రేటు ఎంత, డాక్టర్ పేషెంట్, డిశ్చార్జ్ ఎప్పుడు నాటికలు అలరించాయి. శివా క్లాసికల్ డ్యాన్స్ మ్యూజిక్ అకాడమీ అండ్ యోగా గురువు శివా



స్కిట్ ప్రదర్శిస్తున్న సుబ్రహ్మణ్యం, ప్రకాష్

శిష్య బృందం లిఖిత, సంజన చేసిన శాస్త్రీయ నృత్యం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాకారులను అతిథులు సన్‌మూర్తి, మాల్యాద్రి, సాత్యకి ప్రసాద్, విశ్రాంత డీపీఆర్‌వో ఎల్.బి.వెంకటరావు చేతుల మీదుగా సత్కరించారు.

వాల్తేర్ డివిజన్‌లో స్వచ్ఛ భారత్ స్పెషల్ డ్రైవ్

తాటిచెట్లపాలెం: స్వచ్ఛ భారత్ స్పెషల్ క్యాంపెయిన్–5లో భాగంగా వాల్తేర్ డివిజన్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఎం లలిత్ బోహ్రా తెలిపారు. రైల్వే అధికారులతో ఆదివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ఈ నెల 2న ప్రారంభమైన క్యాంపెయిన్‌లో భాగంగా డీఆర్‌ఎం లలిత్ బోహ్రా నేతృత్వంలో పలువురు ఉన్నతాధికారుల బృందం రైల్వే బోర్డు నిర్దేశించిన సూచనలతో ఈ కార్యక్రమాలను పర్యవేక్షిస్తుందని వాల్తేర్ డివిజన్ అధికారులు చెప్పారు. వాల్తేర్ డివిజన్ ప్రత్యేక కార్యాచరణను రూపొందించి, ప్రత్యేక



మాట్లాడుతున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

వాట్సాప్ గ్రూప్ ద్వారా వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. పెండింగ్ రిఫరెన్స్, పాత ఫైళ్లు పరిశీలించి సాధ్యమైనంత త్వరగా వీటిని పరిష్కరిస్తారని చెప్పారు. ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్, స్క్రాప్ మెటీరియల్ డిస్పోజల్ వంటి పనులు చేపట్టనున్నారని, ప్రత్యేక కార్యక్రమాల ద్వారా వాల్తేర్ డివిజన్ స్వచ్ఛతలో మరో నూతన అడుగు వేయనున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయులకు సత్కారం

సీతంపేట: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హ్యూమన్ రైట్స్ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పైన సెమినార్ హాల్‌లో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి జె.ఎం.నాయుడు హెచ్‌ఆర్‌సీ ప్రాధాన్యాన్ని వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.వి.విశ్వనాధం ఉపాధ్యాయ దినోత్సవ ప్రాధాన్యత తెలియజేశారు. జాతీయ ఉపాధ్యాయుడు రామ్‌సింగ్ అవార్డు గ్రహీత రెడ్డిపల్లి అప్పలరాజుని, ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ఉపాధ్యాయులు సునీత,



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హెచ్‌ఆర్‌సీ ప్రతినిధులు

శ్యామల, విన్నకోట ఫణికుమార్, ఎ.రామలక్ష్మిలను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయంతి రాధాకుమారి, ఉపాధ్యక్షుడు సుదర్శన పట్నాయక్, మంగయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మటన్ షాపులు కిటకిట



నియోజకవర్గంలోని మటన్, చికెన్ షాపులు ఆదివారం వినియోగదారులతో కిటకిటలాడాయి. దసరా పండగ సందర్భంగా గురువారం మాంసాహారానికి దూరంగా ఉన్న వారు.. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆదివారం విందు భోజనాలు చేశారు. శనివారం అర్ధరాత్రి నుంచే మేకలు, గొర్రెలు, కోళ్లను వ్యాపారులు సిద్ధం చేశారు. సీతంపేట, అక్కయ్యపాలెం, సీతమ్మధార తదితర ప్రాంతాల్లోని నాన్ వెజ్ దుకాణాలన్నీ జనంతో రద్దీగా కనిపించాయి.



వైన్ షాపుల వద్ద మందుబాబులు క్యూకట్టారు. అందరూ దసరా పండగ జోష్‌లో మునిగి తేలారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

విద్యార్థులకు యోగా పుస్తకాల అందజేత



విద్యార్థులకు యోగా పుస్తకాలు అందజేస్తున్న తులసీరావు

జగదాంబ: యోగా అందరి జీవితంలో భాగం కావాలని, యోగా ద్వారానే పరిపూర్ణ జ్ఞానం పొందవచ్చని రిషి సంపద ఆశ్రమ నిర్వాహకులు తులసీరావు అన్నారు. వివేకానంద సంస్థలో జరుగుతున్న చిన్నారుల యోగా శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు శ్రీకృష్ణ చైతన్య యోగా కేంద్రం సంపూర్ణ యోగాభ్యాసం 1,2 పుస్తకాలను బహుమతిగా అందించారు. చక్కగా యోగాసనాలు వేస్తున్నారని విద్యార్థులను అభినందించారు. విద్య, కూచిపూడి నృత్యాలు, యోగా వంటి వాటిలో విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్న వివేకానంద సంస్థ అధ్యక్షుడు అప్పారావుని అభినందించారు. ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్ గణేష్, సంస్థ అధ్యక్షుడు అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ ఈస్ట్

9010133346

Office mail : sakshiadvtvsp@gmail.com